క్లుప్తంగా

'డ్రాప్‌బాక్స్' క్లియర్ చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న అబిద్ అలీ

కెరమెరి: డ్రాప్‌బాక్స్‌ను వెంటనే క్లియర్ చేయాలని సెక్టోరియల్ అధికారి అబిద్ అలీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కంప్యూటర్‌లో డ్రాప్ బాక్స్‌లో ఉన్న విద్యార్థుల వివరాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు డ్రాప్ బాక్స్‌లో ఉన్నారన్నారు. ఆయన వెంట ఎంఐఎస్, సీసీవో, సీఆర్‌పీలు, తదితరులు ఉన్నారు.

టీకాలపై గర్భిణులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఈవో రవిదాస్

వాంకిడి: ప్రభుత్వం అందించే టీకాలతో గర్భిణులకు, బిడ్డలకు కలిగే ప్రయోజనాలపై వైద్య విస్తరణ అధికారి పెందూర్ రవిదాస్ అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని బోర్దా, జైత్‌పూర్ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో ఉన్న వారికి మలేరియా, ఆర్‌డీటీ పరీక్షలు చేసి, రక్త నమూనాలు సేకరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. గ్రామంలో డ్రైడే నిర్వహించి నిల్వ నీరు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, యాంటీ లార్వా మందులు వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఏ కృపావాణి, భగవాన్‌దాస్, సిబ్బంది మమత, తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ వాటికలు ఏర్పాటు చేయాలి



పరిశీలిస్తున్న డీపీవో ఒమర్ హుస్సేన్

కెరమెరి: అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో పోషణ్ వాటికలను ఏర్పాటు చేయాలని డీపీవో ఒమర్ హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని జోడేఘాట్‌ను ఆయన సందర్శించారు. గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో ఉన్న మురికి నాలాలు పరిశీలించి మురికి నాలా చివరి భాగంలో సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ టీఏ నాగోరావు, సెక్రటరీ శ్రావణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధన్‌రాజ్

కెరమెరి: తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఐకేపీ సీసీ ధన్‌రాజ్ అన్నారు. శనివారం మండలంలోని బాబేఝరి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు నుంచి కాని స్త్రీనిధి నుంచి కాని ఇప్పటి వరకు రుణాలు తీసుకొని చెల్లించని వారు తక్షణమే చెల్లించాలన్నారు. రికార్డులు సరైన విధంగా నమోదు చేయాలని, పొదుపును పెంచాలని సిబ్బందికి సూచించారు.

భక్తిశ్రద్ధలతో బాబా జన్మదిన వేడుకలు

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామంలో శనివారం జగద్గురు నరేంద్రబాబా 58వ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని నరేంద్రబాబా ఆలయంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో బాబా పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌటాల, చింతలమానెపల్లి ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, డుబ్బుల నాన్నయ్య, ఉప సర్పంచ్ లహంచు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చిలుకూరి సంతోష్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా సంతోష్ ఇంటివద్ద మద్యం లభించినట్లు ఆయన వివరించారు. పట్టుకున్న మద్యం విలువ రూ.3200 ఉంటుందని, మద్యం స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



కెరమెరి: పూజలు చేస్తున్న మహిళలు



ఆసిఫాబాద్: బజార్‌వాడీ దుర్గా మండలి వద్ద..



కెరమెరి: హనుమాన్‌నగర్‌లో భక్తుల పూజలు



సిర్పూర్(టి): హంస వాహనంలో శ్రీ వేంకటేశ్వర స్వామి

దుర్గమ్మా.. దీవించమ్మా..!

కెరమెరి: మండలంలోని వివిధ మండపాల్లో కొలువుదీరిన దుర్గామాతలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకొని మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దీంతో మండపాల వద్ద భక్తుల కోలాహలం నెలకొంది.

మహా సరస్వతీ దేవి రూపంలో..

మండల కేంద్రంలోని వివిధ వాడల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి ఏడో రోజు మహా సరస్వతీ దేవి రూపంలో దర్శనమిచ్చింది. ఆయా మండపాల వద్ద శనివారం భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహాలక్ష్మి అవతారంలో..

దహెగాం: శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ఏడో రోజు శనివారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా అమ్మవారికి నోట్లతో దండ వేశారు. మహిళలు మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద శనివారం నవచండీ సప్తశతి హోమం నిర్వహించారు. వేదపండితులు గురుమూర్తి, దత్తు శర్మ, పతమేశ్వర్, మహేశ్, విఘ్నేశ్‌ల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మండల హిందూ ఉత్సవ సమితి, శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమంతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం నుంచి డౌనల్, శివాజి నగర్, రజక కాలనీ, కంసలివాడ తదితర కాలనీల్లో స్వామివారిని హంస వాహనంలో ఊరేగించారు. ఆయా కాలనీల భక్తులు, మహిళలు హారతులు ఇచ్చి స్వామి వారి దర్శనం చేసుకున్నారు.



దహెగాం: మంగళహారతులు ఇస్తున్న మహిళలు

వేంకటేశ్వర ఆలయంలో పూజలు..

మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టువస్త్రాలు బహూకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉపసర్పంచ్ తోట మహేష్, నాయకులు సంతోష్, కరుణాకర్‌గౌడ్, ప్రసాద్, కిషోర్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు రావర్తి శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో దేవీ శరన్నవరాత్రులు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. నవరాత్రుల్లో 7వ రోజులో భాగంగా శనివారం పట్టణంలోని కేశవనాథ ఆలయంలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. రాత్రి స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. రాజీవ్‌నగర్‌లోని సంఘసేవక దుర్గ మండలి, మహాలక్ష్మి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



రెబ్బెన: ఇందిరానగర్‌లో..

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని గోలేటి, గంగాపూర్ గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలతో పాటు గోలేటి, రెబ్బెన, ఇందిరానగర్‌లలోని దుర్గామాత ఆలయాలను భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో శనివారం ఏడోరోజు అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్, ఆలయ అధ్యక్షుడు తిరుపతిగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం దాతల సహకారంతో బాలాజీ వేంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయంలో కొనసాగుతున్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: వాసవీ మందిర్‌లోని శారదామాత మండపం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



సిర్పూర్ (టి): ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప సతీమణి రమాదేవి



దహెగాం: హోమం చేస్తున్న అర్చకులు

'మూడోసారి గెలుపు బీఆర్ఎస్‌దే'



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం కౌటాలలో ఆయన నివాసంలో కన్నెపల్లి, డబ్బా, బారెగూడ గ్రామాలకు చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. సర్పంచ్ మోర్లె రమేష్, నాయకులు శంకర్, రమేశ్, భాస్కర్, భీంరావు, సురేశ్ పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే కోనప్ప పర్యటించారు. ఈసందర్భంగా పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మండలంలోని గుప్పగూడెం, హేటిగూడ గ్రామాలకు చెందిన ఆయా పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ నానయ్య, ఎంపీటీసీ ధన్‌రాజ్, మండల అధ్యక్షుడు వెంకన్న, వందన, కోటేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో శనివారం పెంచికల్‌పేట్ మండలం గొంట్లపేట గ్రామానికి చెందిన బీజేపీకి చెందిన యువకులు జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఇష్టారాజ్యంగా తైబజార్ రుసుము వసూళ్లు!

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న వారసంత తైబజార్‌లో టెండరుదారులు ఇష్టారాజ్యంగా రుసుము వసూలు చేస్తున్నారని చిరు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి పూలు, పండ్లు, ఇతర సామగ్రి విక్రయించేందుకు వచ్చిన వీధి వ్యాపారుల నుంచి సుమారు రూ. 200 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. సాధారణంగా ఒక దుకాణానికి రూ.50లు మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా, టెండర్‌దారులు అక్రమంగా ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని వీధి వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకుంటున్నారు. పట్టణంలోని ఆలయాలు, కాలనీల్లో మహిళలు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఉత్సాహంగా అర్ధరాత్రి వరకు ఆడిపాడుతున్నారు.

చింతలమానెపల్లి: మండలంలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాలలో సద్దుల బతుకమ్మ సంబరాలను శని, ఆదివారాలలో నిర్వహిస్తున్నారు. మండలంలోని డబ్బా గ్రామంలో బతుకమ్మ సంబరాలలో భాగంగా శ్రీ శివరామ సాయి యూత్ ఆధ్వర్యంలో మహిళలకు బహుమతులు అందజేశారు.

జీఎం కార్యాలయంలో ముందస్తు సంబరాలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు శనివారం కార్యాలయం ఆవరణలో ముందస్తు బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. రెండు రోజుల పాటు కార్యాలయానికి సెలవులు కావడంతో శనివారం జీఎం కార్యాలయంలోని వివిధ విభాగాలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులంతా కలిసి బతుకమ్మలు పేర్చి కార్యాలయం ఆవరణలో బతుకమ్మ పాటలతో సంబరాలు చేసుకున్నారు.



జీఎం కార్యాలయ ఆవరణలో..

'ఈసారి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి'

రెబ్బెన: ఎన్నికల హామీలను అమలు చేయటంలో విఫలమైన బీఆర్ఎస్‌కు ప్రజలు తమ ఓటు హక్కుతో బుద్ధి చెబుతూ ఈసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు అజ్మీర శ్యాంనాయక్ అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి, రోళ్లపాడు గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలను కలుసుకొని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు పరిచే 6 గ్యారంటీలను వివరించారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, మాజీ జెడ్పీటీసీ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



తక్కళ్లపల్లిలో ప్రచారం చేస్తున్న శ్యాంనాయక్

'భవిష్యత్ బాగుండాలంటే బీఎస్పీని గెలిపించండి'

జన్నారం: ఆదివాసీ గూడేలు బాగుపడాలంటే, ఆదివాసీ గిరిజనుల భవిష్యత్ మారాలంటే బహుజన రాజ్యం రావాలని ఖానాపూర్ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి రాథోడ్ బన్సీలాల్ పేర్కొన్నారు. మండలంలోని అలీనగర్, దొంగపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి బీఎస్పీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి ఆదివాసీ అమరవీరుల స్థూపం సాక్షిగా కాంగ్రెస్ పార్టీ గిరిజనులను మోసం చేసిందన్నారు. టైగర్ జోన్ పేరిట ఆదివాసీ కుటుంబాలను ఆగం చేసిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. యువకుల, విద్యార్థుల భవిష్యత్ బాగుపడాలంటే వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జన్నారం మండల బీఎస్పీ నాయకులు కత్తెరపాక రవీందర్, రేఖ్యానాయక్, కళ్యాణ్, భీమన్న, వినోద్, అరుణ్, సతీశ్ పాల్గొన్నారు.



అలీనగర్ ఎన్నికల ప్రచారంలో బన్సీలాల్

వృత్తివిద్యా శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు వృత్తివిద్యా కోర్సులో భాగంగా పది రోజుల పాటు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆదర్శ పాఠశాలల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు రెగ్యులర్ కోర్సులతో పాటు సమాంతరంగా వృత్తివిద్యా కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్‌కేర్ వృత్తివిద్యా శిక్షకులు రాజసులోచన ఆధ్వర్యంలో 13 మంది విద్యార్థులు వారం రోజులుగా వివిధ వైద్య మెలకువలపై శిక్షణ పొందుతున్నారన్నారు. యానిమేషన్ కోర్సులో శిక్షకులు రాజు ఆధ్వర్యంలో స్థానిక ఫొటో స్టూడియోలో 8 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా శిక్షణ తీరును ఆయన పరిశీలించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్‌కుమార్, సీహెచ్‌పీ నర్సింగ్ సూపరింటెండెంట్ చెన్నకేశవ్‌రావ్, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ధ్యానంతోనే మానసిక పరిపక్వత

జైనథ్: ధ్యానంతో ఒత్తిడి, భయం, ఆందోళనలు తొలగిపోయి మానసిక పరిక్వత సాధ్యమవుతుందని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ మహమ్మద్ షరీఫ్ అన్నారు. శనివారం కరంజి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ధ్యానోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. మూడు రోజులుగా విద్యార్థులకు ధ్యానం గురించి బోధించినట్లు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయం

- మహారాష్ట్ర ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి బోడ్కువర్

ఆసిఫాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం దిశగా బీజేపీ పయనిస్తుందని మహారాష్ట్రలోని వణి ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి బోడ్కువర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమ్మేళన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని, ఆసిఫాబాద్ అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల కార్యాచరణ, ప్రణాళిక పార్టీ నాయకులు, కార్యకర్తలకు వివరించారు. అనంతరం జిల్లా పార్టీ నాయకులు సంజీవ్‌రెడ్డిని సన్మానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీర ఆత్మారాం నాయక్, ప్రభారీ వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొట్నాక విజయ్‌కుమార్, సేర్ల మురళీధర్, దోని శ్రీశైలం, తాలూకా కన్వీనర్ సొల్లు లక్ష్మి, ఉపాధ్యక్షులు గుల్బమ్ చక్రపాణి, బానోత్ వెంకట్‌నాయక్, పార్లమెంట్ కో కన్వీనర్ కిరణ్, అరున్‌లోయా, రమేష్ గౌడ్, వందన, సుచిత్, విజయ్, శ్రీధర్, తిరుపతి, వెంకటేశ్, రమేశ్, బొండు పటేల్, వేణు, శంభు, సూర్యప్రకాశ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంజీవ్‌రెడ్డి బోడ్కువర్

బంతిపూలకు భలే గిరాకీ

దహెగాం: బతుకమ్మ పండుగ నేపథ్యంలో బంతిపూలకు భలే గిరాకీ ఏర్పడింది. ఆదివారం సద్దుల బతుకమ్మ జరుపనున్న సందర్భంగా పెద్ద ఎత్తున బంతి పూల విక్రయాలు జరుగుతున్నాయి. కిలో బంతి పూలు రూ. 120 నుంచి రూ. 140 వరకు విక్రయిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న బంతి పూలు



బామానగర్ సమీపంలోని బంతి తోట

జాతీయ అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం

బెల్లంపల్లి: సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు అందుకున్న బెల్లంపల్లి వాసి పెద్దనపల్లి బస్తీకి చెంది న ఓరుగంటి రాధికను శనివారం బీజేపీ శ్రేణులు శాలువాతో ఘనంగా సన్మానం చేసి అభినందించా రు. సిద్దిపేటలోని ఎన్సాన్‌పల్లి ప్రభుత్వ సాంఘిక స ంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రాధిక పీజీ టీగా పనిచేస్తోంది. జాతీయ బహుజన సాహిత్య అకాడమీ రాధికను సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు–2023కు ఎంపిక చేయగా ఇటీవల ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేశారు. సన్మాన కార్యక్రమంలో బీజేపీ పట్టణ కార్యదర్శి కనకం విజయ్, మహిళ మోర్చా పట్టణ అధ్యక్షురాలు ధార కళ్యాణి పాల్గొన్నారు.



రాధికను సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు